సాక్షి సంగారెడ్డి

శనివారం, 18, నవంబర్, 2023



ప్రత్యేక మేనిఫెస్టో..

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించామని బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ తెలిపారు.

వివరాలు 10లో ▸



ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు.

వివరాలు 11లో ▸

జిల్లా నూతన జడ్జిగా ప్రభాకరరావు

సంగారెడ్డి టౌన్ : జిల్లా నూతన జడ్జిగా ప్రభాకర రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మంచిర్యాల కోర్టు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన స్థానంలో ఇక్కడున్న శశిధర్ రెడ్డి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభాకర రావు మాట్లాడుతూ అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

అయ్యప్ప మహాపడి పూజ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి గ్రామ వార్డు సభ్యుడు సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామివారి సన్నిధిలో గురుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప మాలధారులు ఆలపించిన గీతాలు భక్తులను అలరించాయి. స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని వార్డు సభ్యుడు సురేశ్ ఆకాంక్షించారు. సర్పంచ్ సత్యనారాయణ, ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాసాలలో ఆందోళన



ఆందోళన చేస్తున్న యువకులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కాసాలను దౌల్తాబాద్‌ను కలిపి మునిసిపాలిటీ చేస్తామని నర్సాపూర్ సభలో సీఎం ప్రకటనకు వ్యతిరేకంగా గ్రామ యువకులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. మునిసిపాలిటీ చేస్తే గ్రామం నష్టపోతుందని చెప్పారు. మున్సిపల్ చేస్తామన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు. ఇప్పుడిప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుంటే అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. రెండు, మూడు రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను పెద్దెత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వీధి కుక్కల వీరంగం

- 10 మందికి గాయాలు



గాయపడ్డ కాలనీవాసులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఉన్న గాంధీనగర్‌లో వీధికుక్కలు వీర విహారం చేస్తున్నాయి. గురువారం రాత్రి సమయంలో రోడ్డు పక్క నుంచి వెళ్తున్న వ్యక్తులపై కుక్కలు దాడులు చేశాయి. ఇందులో పది మందికి గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అక్కడ బీజేపీ నాయకుడు ఆనంద్ కృష్ణారెడ్డి గాయపడ్డ వారికి అందుతున్న చికిత్సను పరిశీలించారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంతోనే వీధి కుక్కలు వీర విహారం చేస్తున్నాయని, వీటిని నివారించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఝరాసంగం(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కోహీర్ మండల పరిధిలోని మద్రి గ్రామానికి చెందిన సత్యనారాయణ(28) జహీరాబాద్‌లోని ప్రైవేటు ఫైనాన్స్‌లో ఫీల్డ్ ఆఫీసర్. రోజులాగా విధినిర్వహణలో భాగంగా జహీరాబాద్ నుంచి ఝరాసంగం వైపునకు వస్తున్నాడు. కుప్పానగర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి వివరించారు.

రైలు కింద పడి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

- సస్పెన్షన్ ఎత్తేయకపోవడంతో మనస్తాపానికి గురై బలవన్మరణం



నర్సింహులు

జహీరాబాద్: రైలు కింద పడి ఆర్టీసీ బస్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కాశీంపూర్‌కు చెందిన నర్సింహులు(55) పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. బస్సు నడుపుతూ ప్రమాదానికి కారణమయ్యాడని ఉన్నతాధికారులు రెండు నెలల క్రితం సస్పెండ్ చేశారు. ఎంతకీ విధుల్లోకి తీసుకోకపోవడంతో మనస్తాపం చెందిన అతను రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు తన ఇంటి సమీపాన ఉన్న రైల్వే ట్రాక్ వద్ద మృతదేహం పడి ఉన్న మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించి పంచనామా నిర్వహించారు. కేసును వారు దర్యాప్తు చేస్తున్నారు.

బైజేపీ



పార్టీని వీడిన కీలక నేతలు

- బీఆర్ఎస్‌లో చేరిన దేశ్‌పాండే, గోపి, గడీల
- మూడు చోట్ల కాషాయ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఎన్నికల వేళ బీజేపీకి జిల్లాలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పలు నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా వ్యవహరించిన నాయకులు, రాష్ట్రకార్యవర్గ సభ్యులుగా ఉన్న నేతలు బీజేపీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిశాక పోలింగ్ దగ్గర పడుతున్న తరుణంలో బీజేపీ నుంచి వలసలు ఆ పార్టీని కోలుకోలేని విధంగా దెబ్బతగిలినట్లయింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే సంగారెడ్డి టికెట్ ఆశించారు. చివరి క్షణంలో భంగపాటుకు గురయ్యారు. ఈ టికెట్ పులిమామిడి రాజుకు దక్కడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన రెండు రోజుల క్రితం ఆ పార్టీకి రాజీనామా చేసి, నర్సాపూర్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

నర్సాపూర్‌లోనూ సింగాయపల్లి గోపి

నర్సాపూర్‌లోనూ బీజేపీకి నష్టం జరిగింది. ఈ టికెట్ దక్కని సింగాయపల్లి గోపి కూడా కేసీఆర్ సమక్షంలోనే నర్సాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయన సైతం నర్సాపూర్ బీజేపీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మురళీ యాదవ్‌కు దక్కడంతో గోపి అసమ్మతి రాగం ఆలపించారు. తన అనుచరులతో సమావేశం నిర్వహించి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

బీజేపీకి గుడ్‌బై చెప్పిన గడీల..

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడీల శ్రీకాంత్‌గౌడ్ సైతం కారెక్కారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో చురుకుగా బీజేపీ కార్యక్రమాలు నిర్వహించిన ఆయన ఇక్కడి టికెట్ విషయంలో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. టికెట్ నందీశ్వర్‌గౌడ్‌కు ఇవ్వడంతో గడీల నిరసన తెలిపారు. ఇలా జిల్లాలో పలుచోట్ల బీజేపీకి గట్టి ఎదురు దెబ్బతగిలింది. దీని ప్రభావం రానున్న పార్లమెంట్ ఎన్నికలపైనా పడే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

పట్టించుకోని అధినాయకత్వం

టికెట్లు దక్కక తీవ్ర అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగించి కాపాడుకోవడంలో కమలం పార్టీ రాష్ట్ర నాయకత్వం విఫలమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి తదితరులు టికెట్లు దక్కని అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. కానీ రాష్ట్ర నాయకత్వం మాత్రం కనీసం పిలిచి మాట్లాడి సముదాయించకపోవడంతో నేతలు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు ప్రచారం జరుగుతోంది.

చక్రం తిప్పిన మంత్రి హరీశ్‌రావు

కమలం అసమ్మతి నేతలను తమ వైపు తిప్పుకోవడంలో మంత్రి హరీశ్‌రావు మంత్రాంగం పనిచేసింది. తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులతో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్‌లో చేరేలా చక్రం తిప్పారు. స్వయంగా వారి నివాసాలకు వెళ్లి వారి రాజకీయ భవిష్యత్‌పై భరోసా కల్పించారు. దీంతో కీలక నాయకులు ఆ పార్టీ వీడి కారెక్కారు. మొత్తంగా ఎన్నికల ప్రక్రియ ఊపందుకున్న ఈ నేపథ్యంలో బీజేపీ కీలక నేతలు పార్టీని వీడటంతో బీజేపీకి గట్టి ఎదురు దెబ్బతగిలినట్లయింది.

కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమే

హోంమంత్రి మహమూద్‌అలీ



మాట్లాడుతున్న మహమూద్ అలీ, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్

పటపల్లి(అందోల్): కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మోసపోతారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని అన్నాసాగర్ వద్ద గల ఫంక్షన్ హాల్‌లో జరిగిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు మైనార్టీలను పట్టించుకోలేదన్నారు. ఒక కార్పొరేషన్ పదవీ ఇవ్వలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర తర్వాత ముస్లింలకు మంచి రోజులు వచ్చాయన్నారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు మేనమామలా షాదీముబారక్ ద్వారా రూ.1,00,116 ఇస్తున్నారన్నారు. రంజాన్ పండగను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. గతంలో మైనార్టీల సంక్షేమానికి నిధులు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులను కేసీఆర్ కేటాయించారని పేర్కొన్నారు. ఇమామ్‌లకు గౌరవ వేతనాన్ని ఇచ్చి కేసీఆర్ గౌరవించారన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఓవర్సీస్ పథకం ద్వారా 3,300 మంది లబ్ధిపొందారని గుర్తుచేశారు. డిసెంబర్ 3 తర్వాత రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని సీఎం 10 ఏళ్లలో చేసి చూపించారన్నారు. ఆ పార్టీ వాళ్లలో వాళ్లు గొడవలు పరిష్కరించుకోవడానికే సమయం లేదన్నారు. ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని విమర్శించారు. స్థానికంగా ప్రజల సమస్యలు తెలిసిన క్రాంతికిరణ్ ఎమ్మెల్యేగా ఉండటం తమ అదృష్టమన్నారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, మరోసారి అవకాశం ఇవ్వండి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రభుత్వం మైనార్టీలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి ఆదుకుంటుందని చెప్పారు. పథకాలు కొనసాగాలంటే కేసీఆర్‌ను మరోసారి గెలిపించాలన్నారు. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా? 24 గంటలు ఇస్తున్న బీఆర్ఎస్ అధికారంలోకి రావాలో? ప్రజలు తేల్చుకోవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ మాట్లాడుతూ, మైనార్టీలు బీఆర్ఎస్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నారాయణ, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఫైజల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుటుంబ పాలన

- డబ్బు సంపాదనే వారి ధ్యేయం
- జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ విమర్శలు



మాట్లాడుతున్న బాబూలాల్ మరాండీ

జహీరాబాద్: రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని, డబ్బు సంపాదనే ధ్యేయంగా పాకులాడుతున్నారని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ విమర్శించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన మొగుడంపల్లిలో బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ తరఫున నిర్వహించిన ప్రచార సభలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు. హస్తం ప్రభుత్వ హయాంలోనే దేశం అన్ని విధాలుగా నాశనమైందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలోనే దేశం అన్ని విధాలుగా సుభిక్షంగా ఉందని అన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. ప్రజలకు ఉచితంగా రేషన్ అందిస్తున్న ఘనత ఎన్డీఏ సర్కారుకే దక్కిందన్నారు. జహీరాబాద్ అభ్యర్థి రాంచందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

147 కేసులు.. రూ.4.61 కోట్లు సీజ్

సంగారెడ్డి టౌన్ : ఎన్నికల నిబంధనల మేరకు జిల్లాలో ఇప్పటివరకు 147 కేసుల్లో రూ.4,61,60,738లు సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి శరత్ శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు 50 వేల రూపాయలు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న 147 మంది నుంచి రూ.4,61,60,738లు సీజ్ చేశామన్నారు. సరైన ఆధారాలు సమర్పించిన 133 మందికి 3,08,55,738 రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. మిగతా 14 కేసుల్లో సీజ్ చేసిన రూ.1,53,05,000లకు సంబంధించి మూడు కేసుల్లో 1,37,26,000 ఆదాయ పన్ను శాఖకు రిఫర్ చేసినట్లు చెప్పారు. మిగతా 11 కేసులకు సంబంధించి రూ.15,79,000లకు సరైన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి డబ్బును విడుదల చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

జహీరాబాద్: మద్యం దుకాణాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణంలో గల పలు దుకాణాలను సందర్శించి మద్యం నిల్వలు ఏ మేరకు ఉన్నాయనేది తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.



రిజిస్టర్ పరిశీలిస్తున్న వెంకారెడ్డి



బలగాల కవాతు

నారాయణఖేడ్: ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. పోలీసుస్టేషన్ నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా కొనసాగింది. ప్రధాన కూడళ్లలో, పట్టణంతోపాటు డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని డీఎస్పీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.

ఫోన్ నంబర్ ఆధారంగా ఆచూకీ

అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు

జోగిపేట (అందోల్): ఓ వ్యక్తి అదృశ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. ఫోన్ నంబర్ ఆధారంగా అతని ఆచూకీ కనుగొన్నారు. ఈ సంఘటన జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మెకానిక్ సుమన్ అప్పులపాలయ్యాడు. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటం.. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే..అదే సమయంలో ఫైజాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డికి బైక్ రిపేరైందని, డబ్బులు పంపాలని సుమన్ కొత్త నంబర్‌తో ఫోన్ చేశాడు. వాహనం తీసుకోవడానికి వచ్చిన నర్సింహారెడ్డికి షాపు మూసి ఉండటం చూసి పక్కనున్న వారిని ఆరా తీశాడు. అతను అదృశ్యమైన విషయం తెలియడంతో ఇంతకు ముందే వచ్చిన ఫోన్ నంబర్ చూపించాడు. అదే సమయంలో సుమన్ భార్య పోలీస్‌స్టేషన్‌లో ఉండటం తెలియడంతో ఈ విషయం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు యాప్ ద్వారా అతని ఆచూకీ కోసం యత్నించగా.. కామారెడ్డిలో ఉన్నట్లు గుర్తించారు. కారులో వెళ్లిన కుటుంబ సభ్యులు అతని ఆచూకీని కనుగొన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిందే

ఎస్పీ రూపేశ్



దౌల్తాబాద్ చెక్‌పోస్ట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

హత్నూర(సంగారెడ్డి): పోలీస్ చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని వదలకుండా తనిఖీ చేయాల్సిందేనని ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రూపేశ్ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలం దౌల్తాబాద్ సమీపంలో సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా వాహనాలను క్షుణంగా పరిశీలించాలన్నారు. అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట సీఐ వేణుగోపాల్ ఎస్ఐ సుభాశ్, సిబ్బంది ఉన్నారు.

నేడు చేర్యాలకు సీఎం కేసీఆర్

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ శనివారం చేర్యాలకు వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాలలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే సభ కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వేలాది మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

బహిరంగ సభ వేదికతో పాటు పలు చోట్ల సీఎం ప్రత్యేక నిఘా విభాగం, బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. కేసీఆర్ వచ్చే మార్గం మొత్తం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బందోబస్తు కోసం 600 మంది పోలీసులను నియమించారు. నలుగురు అదనపు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 20మంది సీఐలు, 60మంది ఎస్ఐలతో పాటు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, క్విక్ రెస్పాన్స్ బృందాలు తదితర వాటిని కలుపుకుని మొత్తం 600 మంది సీఎం బహిరంగ సభ బందోబస్తు విధులు నిర్వహించనున్నారు.

సీపీ పరిశీలన..

ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణాన్ని సీపీ శ్వేత పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు, బహిరంగ సభ వేదిక, సభకు వచ్చే మార్గాలతో పాటు వెళ్లే సమయాల్లో తీసుకునే జాగ్రత్తలు, వీఐపీ దారులు, తదితర వాటికి సంబంధించిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. అంతకు ముందు బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఇదిలా ఉంటే సీఎం సభకు భారీగా ప్రజలను తరలించేందుకు బీఆర్ఎస్‌లోని ముఖ్యులకు బాధ్యతలు అప్పగించారు..

డైలమాలో ట్రైడెంట్ !

- క్రషింగ్ లేనట్లేనా?
- సిద్ధం కాని కార్యాచరణ
- పక్క రాష్ట్రాలకు చెరకు తరలిస్తున్న రైతులు



ట్రైడెంట్ కర్మాగారం

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి)లో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో ఈ సీజన్‌కు గాను క్రషింగ్‌ను ప్రారంభించడం అనుమానంగానే ఉంది. ఈనెల మొదటి వారంలోనే ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటికే సగం రోజులు గడిచిపోయాయి. ఈ విషయంలో యాజమాన్యం నుంచి స్పందన లేదు. ప్రభుత్వం సైతం రైతాంగానికి ఎలాంటి స్పష్టతనివ్వక పోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో ఇటు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం, అధికార యంత్రాంగం కానీ చొరవ చూపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు యాజమాన్యం, అధికార యంత్రాంగం స్పష్టమైన హామి ఇచ్చినా ఆచరణలో మాత్రం విఫలం అయ్యారనే విమర్శలున్నాయి. గత క్రషింగ్ సీజన్ బకాయిలు సైతం పెండింగ్‌లోనే పెట్టింది.


4.50 లక్షల టన్నుల పంట

జహీరాబాద్ కర్మాగారం జోన్ పరిధిలో 4.50లక్షల టన్నుల మేర చెరకు ఉత్పత్తి అవుతుందనే అంచనా. సుమారు 17వేల ఎకరాల్లో పంట సాగులో ఉంది. గత ఏడాది సైతం ఇంతే స్థాయిలో సాగయ్యింది. కర్మాగారంపై రైతులకు నమ్మకం లేక పోవడంతో సగం చెరకు ఉత్పత్తులను పక్క రాష్ట్రాల్లోని కర్మాగారాలకు తరలించుకున్నారు. ఈ ఏడాది కూడా ట్రైడెంట్ యాజమాన్యంపై నమ్మకం కుదరడం లేదు. దీంతో మొత్తం పంటను పక్కా రాష్ట్రాలకే తరలించుకోవాలనే ఉద్దేశంతో రైతులున్నారు. గత బిల్లులు కూడా సక్రమంగా చెల్లించక పోవడం కూడా ఒక కారణంగా రైతులు చెబుతున్నారు. ఆ సీజన్‌కు సంబంధించి యాజమాన్యం రైతులకు సుమారు రూ.9కోట్ల మేర బకాయి పడింది.

2.55లక్షల టన్నుల చెరకు క్రషింగ్

ట్రైడెంట్ కర్మాగారంలో 2022–23 క్రషింగ్ సీజన్‌కు గాను 2.55 లక్షల టన్నుల చెరకును గానుగాడించింది. టన్నుకు రూ.3,270 ధర నిర్ణయించింది. మొదటి విడత కింద టన్నుకు రూ.3వేల వంతున చెల్లిస్తూ వచ్చింది. మిగతా రూ.270 పెండింగ్ పెట్టింది. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మాసంలో చెరకును సరఫరా చేసిన రైతులకు మాత్రం పూర్తి స్థాయిలో బిల్లులు బకాయి పడింది. జోన్ పరిధిలో ఉన్న మొత్తం 2287 మంది రైతులు కర్మాగారానికి చెరకును సరఫరా చేశారు. ఇందులో 1699 మంది రైతులకు టన్నుకు రూ.270 వంతున బకాయి పడింది. మిగిలిన రైతులకు పూర్తి స్థాయిలో బిల్లులు బకాయి పడింది. రూ.83 కోట్లకు గాను ఇంకా రూ.9 కోట్ల మేర బకాయిలను చెల్లించాల్సి ఉందని రైతులు పేర్కొంటున్నారు.

కర్ణాటకకు తరలించుకుంటున్నా



క్రషింగ్ ప్రారంభించేందుకు యాజమాన్యం ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. కర్ణాటకకు పంటను తరలించుకుంటున్నా. ఇప్పటికే 200 టన్నుల చెరకును తరలించా. 45 ఎకరాల్లో చెరకు సాగు చేసుకున్నా. 2 వేల టన్నుల చెరకు ఉత్పత్తి కానుంది. గత ఏడాదికి సంబంధించి యాజమాన్యం వద్ద నుంచి రూ.5 లక్షల మేర బిల్లులు కూడా రావాల్సి ఉంది.

బి.మల్లికార్జున్‌రెడ్డి,రైతు ధనాసిరి, మొగుడంపల్లి మండలం

లేగదూడల మరణాలు తగ్గించవచ్చు

పశువైద్యాధికారులు హేమలత, సంధ్యారాణి



మిచిన్నూర్‌లో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరం

హత్నూర (సంగారెడ్డి): ఉచిత పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు హేమలత, సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని గుండ్ల మాచిన్నూర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భకోశ చికిత్సలు 28, సాధారణ చికిత్సలు 28, కృత్రిమ గర్భధారణ 3, చూడి పరీక్షలు 18, లేక దూడలకు నట్టల నివారణ మందులు వేశామని తెలిపారు. దూడలకు నెలకు ఒకసారి ఆరు మాసాలు మందులు తాగించుకోవాలని పేర్కొన్నారు. ఇలా చేసినట్లయితే వాటి మరణాలు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రులు బీ సుధాకర్, జీ నాగేశ్, జే నరేశ్‌కుమార్, పీఎల్‌ఓ మధుసూదన్, పాడి రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోమన్ టెన్జింగ్ భూటియా అన్నారు. శుక్రవారం సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సీఐ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చిన్నకోడూరులో పోలింగ్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న అధికారి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, మైలారం, అల్లీపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల అబ్జర్వర్ జయశ్రీ బోజ్ పరిశీలించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఉద్రిక్తత చోటు చేసుకున్న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు, తహసీల్దార్ జయలక్ష్మి, ఎస్ఐ సుభాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి. రఘురాం తెలిపారు. శనివారం పట్టణంలోని రవీంద్ర హైస్కూల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రిటర్నింగ్ అధికారి వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చేగుంట నుంచి మెదక్‌కు వెళ్తున్న దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ జయచంద్రారెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌టీ టీం లీడర్ తిరుమలేష్‌కు ఆయన పలు సూచనలు చేశారు.

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి



కాడిపల్లి : వెల్మకన్నలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి, పక్కన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



కొట్టాలలో భారీ ర్యాలీ

కౌడిపల్లి(నర్సాపూర్): సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి జరిగిందని,, తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి మండలం లింగంపల్లి, బిట్లతండా, కొట్టాల, వెల్మకన్న, దేవులపల్లి, మహ్మద్‌నగర్, కూకుట్లపల్లి, భుజిరంపేట, పీర్యతండా తదితర గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పరంపోగు భూములన్నింటిని పట్టా భూములుగా మారుస్తామని చెప్పారు. ఇప్పటికే రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్‌తో రైతులను ఆదుకుంటున్నామని చెప్పారు. గడపగడపకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

బిట్లతండాకు సీఎం కేసీఆర్‌ను తీసుకువస్తా..

బిట్లతండాలో 36 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని, తండావాసులు కోరితే తండాకు సీఎం కేసీఆర్‌ను తీసుకువస్తానని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. అన్ని తండాలను సీసీ రోడ్లు వేశామన్నారు. బీటీ రోడ్లకు సైతం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సునీతారెడ్డికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. లింగంపల్లితోపాటు పలు గ్రామాలు, తండాలు కొత్తపంచాయతీలుగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మండలంలోని కొట్టాలలో ప్రవీన్‌గౌడ్‌తోపాటు బిట్లతండా, మహ్మద్‌నగర్ గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీలో చేరిన యువకులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.

–ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

పనిచేసేవారికి కాంగ్రెస్ మోసం..

కష్టపడి పనిచేసేవారిని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని గాలి అనిల్‌కుమార్ విమర్శించారు. వెల్మకన్నలో సునీతారెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. కాంగ్రెస్‌పార్టీ మోసాన్ని భరించలేక సొంత పార్టీలోకి వచ్చానని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రపుర్ కార్పొరేటర్ పుష్ప, ఎంపీపీ రాజు, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, జెడ్పీటీసీ కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్లం, నర్సింగారావ్, దివ్య, సుజాత, వనజ, ప్రమీళ, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్‌గుప్తా, కిషోర్‌గౌడ్, దూద్యనాయక్, వీరయ్య, రాజు, శివరాజ్, కిరణ్‌గుప్తా, సంతోష్‌గౌడ్, లింగం, రాజు, కాంతారావ్, పాల్గొన్నారు.

–గాలి అనిల్‌కుమార్

బీఆర్ఎస్ పాలనలో సంక్షేమం

వెల్దుర్తి(తూప్రాన్): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఆదరించి మరోసారి పట్టం కట్టాలని సునితారెడ్డి కోరారు. వెల్దుర్తి మండలం మహ్మద్‌నగర్ తండాలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, నాయకులు నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్, పెంట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సునీతారెడ్డి విజయం ఖాయం

హత్నూర(సంగారెడ్డి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి విజయం ఖాయమని ఎంపీపీ అధ్యక్షులు వావిలాల నర్సింలు అన్నారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్ లో ఎంపీపీ నర్సింలు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య, కిషోర్, అజమత్ అలీ, కొన్యాల సతీష్ ,సాజిద్ ,శేఖర్ గౌడ్ ,సాయికుమార్, వెంకటేష్ గౌడ్, కిషన్ గౌడ్, గౌస్, అజీస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటే..

మంత్రి తన్నీరు హరీశ్‌రావు



కుకునూరుపల్లి రోడ్ షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటే ఉంటుందని వైద్యారోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన రోడ్ షో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి మూడు గంటల కరెంటు సరిపోతుందంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం దుకాణాల వద్ద చెప్పులను క్యూలో పెట్టిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. బిందెడు తాగునీళ్ల కోసం దూరం వెళ్లి తెచ్చుకున్నప్పుడు భుజాలు కాయలు కాసిన విషయం వాస్తవం కాదా అని అన్నారు. తెలంగాణలో మహా అయితే ఒకటి రెండు చోట్ల గెలిచే బీజేపీ నేత గజ్వేల్‌లో ఓట్లు దండుకునేందుకు బీసీని సీఎం చేస్తామంటూ చెబుతున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను తిప్పలు పెట్టేందుకు ఢిల్లీ నుంచి డబ్బుల సంచులతో బీజేపీ నాయకులు బయలు దేరారన్నారు. అవసరం కోసం దగ్గరికి వచ్చే కాంగ్రెస్, బీజేపీలు కావాలో.. ప్రజల ఆపద, సంపదల్లో పాలుపంచుకుంటున్న సీఎం కేసీఆర్ కావాలో ఆలోచించాలన్నారు. కరోనా కష్ట కాలంలో ఎక్కడ పోయారో ఓట్లు అడుగడానికి వచ్చే ప్రతిపక్ష పార్టీలను అడుగాలన్నారు. రూ.14 వేల కోట్లతో రైతు రుణాలు మాఫీ చేశామని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల రుణమాఫీ ప్రక్రియను ముచ్చటగా మూడో సారి అధికారంలోకి రాగానే పూర్తి చేసి తిరిగి రుణాలు అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో 13లక్షల2వేల 53 మంది కల్యాణ లక్ష్మి పథకంలో లబ్ధిపొందారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూంలను కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. తెలంగాణ సంపదను పెంచి పథకాల రూపాల్లో పేదలకు పంచుతామన్నారు. 24 గంటల పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, నాయకులు పొల్కంపల్లి నరేందర్, కోల సద్గుణ, పిస్క అమరేందర్, మల్లం ఐలయ్య, లక్ష్మన్‌రాజు, భూములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటలను ప్రజలు నమ్మరు

కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఇతర నాయకులు

నర్సాపూర్: సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలను నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు నమ్మరని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరందిస్తానని, 2018లో నర్సాపూర్‌ను దత్తత తీసుకుని బంగారు తునక చేస్తానని సీఎం హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని, ప్రస్తుతం ఇచ్చేవాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన చెప్పారు. ధరణి.. పేద రైతుల పాలిట శాపంగా మారిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేసి భూమాత పోర్టల్ ద్వారా న్యాయం చేస్తామని చెప్పారు. ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ఇచ్చిన హామీలన్నీ గతంలో మాదిరిగానే తుంగలో తొక్కుతారని ఎద్దేవా చేశారు. దేవులపల్లి, వెల్మకన్నె, ముంద్రాయి, శివ్వంపేట తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములను ధరణిలో పార్ట్ బీలో పెట్టి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని, అనంతరం వాటి రికార్డులు సరి చేయించుకుని అధిక ధరలకు అమ్ముతూ కోటీశ్వరులయ్యారని విచారం వ్యక్తం చేశారు. కాగా బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి స్వగ్రామమైన గోమారంను మండల కేంద్రం చేయాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. సమావేశంలో చిలుముల శేషాసాయిరెడ్డి, ఖాలేక్, ఆంజనేయులుగౌడ్, రిజ్వాన్, మల్లేష్, శ్రీనివాస్‌గుప్తా, రవీందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, రాజాగౌడ్, మల్లేష్‌గౌడ్, అశోక్ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో ప్రచారం

ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా నర్సాపూర్‌లోని రెండో వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో చిన్న అంజిగౌడ్, సుధీర్‌గౌడ్, రషీద్ పాల్గొన్నారు.

అప్పుల్లో తెలంగాణ..

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్, తిరుమలాపూర్, బ్రాహ్మణపల్లి ఆయా పంచాయతీల పరిధిలోని గిరిజన తండాల్లో ఆవుల రాజిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ నాయకులు అప్పుల పాలుచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ తీసుకువచ్చిన 6 గ్యారంటీ పథకాలను గుర్తించి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్ గుప్తా, రవీందర్ రెడ్డి, మల్లేష్, అశోక్, ఆకుల నర్సింలు, సుధీర్ గౌడ్, నందు, అశోక్ గౌడ్, ఉదయ్ పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని విఠల్ తండా సమీపంలో ధాన్యం నూర్పిడి పడుతూ ఓటు వేయాలని రాజిరెడ్డి కోరారు.

ఆరు గ్యారంటీలు అమలు

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల సంక్షేమం కోసం 6 గ్యారంటీలు అమలు చేయనున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి భార్య శైలజారెడ్డి, సుహాసినిరెడ్డి, కమల, సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తాలు అన్నారు. శుక్రవారం దంతన్‌పల్లి, రత్నపూర్ తండాతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సంఘటితంగా కృషిచేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి గెలుపుకోసం కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పులింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్‌రెడ్డి, సంజీవరెడ్డి, గుత్తి కిషన్, సత్యనారాయణ, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చిలప్‌చెడ్(నర్సాపూర్)): ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, సర్వర్‌మీర్జా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, భూమయ్య, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం రేండ్లగూడ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆవుల కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హకీం పాల్గొన్నారు.



ధాన్యం నూర్పుడి పడుతూ..



దంతన్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న శైలజారెడ్డి



తుజాల్‌పూర్‌లో ప్రచారం

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం



తాటిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

ఆ పార్టీ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం పోతులబోగుడాలోని తన నివాసంలో అల్లాదుర్గ్ మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలతో పాటు శివాజీ యూత్ సభ్యులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, అల్లాదుర్గ్ మండల పార్టీ ప్రధానకార్యదర్శి రామాగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెంటయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో సుపరిపాలన

టేక్మాల్(మెదక్): బీఆర్ఎస్‌తోనే సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్ అన్నారు. అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ గెలుపు కోసం శుక్రవారం ఆయన మండలంలోని వెల్పుగొండ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగంలో ఉంచిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రజల మధ్యలో ఉండే క్రాంతికిరణ్ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరప్ప, చింత రవి, నారాయణ, పోలు, రమేష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న చంటి పద్మావతి

క్షేత్రస్థాయిలో పథకాల అమలు

మునిపల్లి(అందోల్): సీఎం కేసీఆర్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి, పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, మేళసంగ్యం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు తాటిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. పిల్లోడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎక్కువ చేస్తే తోకలు కత్తిరిస్తానని క్రాంతి కిరణ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి, సాయికుమార్, విజయ్ కుమార్, శశికుమార్, నవాజ్‌రెడ్డి, బక్కారెడ్డి పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

రేగోడ్(మెదక్): అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను మరోసారి గెలిపించి ఆశీర్వదించాలని ఆయన సతీమణి పద్మావతి కోరారు. చౌదర్‌పల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటింటి పచ్రారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోయి గోస పడొద్దని ప్రజలను కోరారు.

సంగారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో



గోపులారంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు

- పనిచేసేవారికే పట్టం కట్టండి
- ఐటీహబ్, మెట్రోరైల్ తీసుకొస్తాం
- బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి: నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించామని బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజేందర్, దేశ్పాండే, సంగారెడ్డి కోఆర్డినేటర్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, నరహరిరెడ్డి, విజేందర్‌రెడ్డి తదితరులతో కలిసి మేనిఫెస్టోను ఆవిష్కరించారు.



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, నాయకులు

మేనిఫెస్టోలోని హామీలు..

1. ఐటీ హబ్ ఏర్పాటు..
సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉద్యోగం చేసుకొనేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన కష్టం లేకుండా సంగారెడ్డిలోనే ఐటీహబ్ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

2.మెట్రో రైలు మార్గం..
వస్తుతం మియాపూర్ వరకు ఉన్న మెట్రో రైలు మార్గాన్ని సంగారెడ్డి వరకు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే రెండు, మూడేళ్లల్లో సంగారెడ్డి వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని విస్తరిస్తాం.

3. సంగమేశ్వర ప్రాజెక్టుతో సాగునీరందిస్తాం..
సంగమేశ్వర ప్రాజెక్టు ద్వారా రాబోయే ఐదేళ్లల్లో పంట కాలువలను నిర్మించి సాగునీరందిస్తాం.

4. ఔటర్ రింగురోడ్డు నిర్మాణం..
సంగారెడ్డి పట్టణం చుట్టూ ఔటర్ రింగు రోడ్డు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటు ముంబై హైవే, అటు నాందేడ్ హైవేని కలుపుకొని సంగారెడ్డి చుట్టూ ఔటర్ రింగు రోడ్డును ఐదేళ్లల్లో పూర్తిచేస్తాం.

5. ఈఎస్ఐ ఆస్పత్రి..
సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో ఉన్న కార్మికులకు వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంగారెడ్డిలో ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తాం.

6. డంపు యార్డుల ఏర్పాటు..
సంగారెడ్డి, సదాశివపేట పట్టణంలో శాశ్వత ప్రాతిపదికన డంపుయార్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే రెండు మూడేళ్లల్లో డంప్ యార్డులను నిర్మిస్తాం.

7. రవీంద్రభారతి ఆడిటోరియం నిర్మిస్తాం
సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో ఒక్కో ఆడిటోరియం నిర్మిస్తాం. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి తరహాలో ఈ రెండు ఆడిటోరియాలను రాబోయే రెండు మూడేళ్లల్లో నిర్మించి పూర్తిచేస్తాం.

8. జలవిహార్ తరహాలో..
సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువును ఆధునీకరించి, వాటర్, స్పోర్ట్స్ ఆడేవిధంగా హైదరాబాద్‌లోని జలవిహార్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే రెండు మూడేళ్లల్లో పనులను పూర్తి చేస్తాం.

9. రాజీవ్‌పార్క్ ఆధునీకరణ..
సంగారెడ్డిలోని రాజీవ్‌పార్కును అంతర్జాతీయ స్థాయిలో ఆధునీకరిస్తాం. వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్, యోగా సెంటర్, పిల్లల క్రీడా ప్రాంగణాలతో పార్కును రెండేళ్లల్లో అభివృద్ధి చేస్తాం.

10. అంబేడ్కర్ స్టేడియం ఆధునీకరణ..
సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో అన్ని క్రీడాపోటీలు నిర్వహించుకునేవిధంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేవిధంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం తరహాలో రెండేళ్లలో పూర్తిచేసి అన్ని క్రీడలకు కోచ్‌లను నియమిస్తాం.

11. కోల్డ్ స్టోరేజీల నిర్మాణం..
పండ్లు, కూరగాయలు పండించే రైతుల కోసం సంగారెడ్డి, సదాశివపేటలో కోల్డ్ స్టోరేజీలను రెండు మూడేళ్లల్లో నిర్మిస్తాం.

12. హార్టికల్చర్ పాలిటెక్నిక్..
పెద్దాపూర్ నర్సరీలను మరింత గొప్పగా తీర్చిదిద్దేందుకు, సంగారెడ్డి నియోజకవర్గంలో ఉద్యానవన పంటలను పెంపొందించేందుకు వీలుగా హార్టికల్చర్ పాలిటెక్నిక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

13. మహిళా జూనియర్ డిగ్రీ కాలేజీల ఏర్పాటు..
సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో మహిళా జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేస్తాం వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలలను ప్రారంభిస్తాం

14. మహిళల కోసం డిగ్రీ రెసిడెన్షియల్..
సంగారెడ్డిలో బీసీలు, మైనారిటీల బాలికల డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలను ఏర్పాటు చేస్తాం.

15. షాదీఖానాల నిర్మాణం..
సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో ముస్లిం మైనార్టీలను కోసం షాదీఖానాలను నిర్మిస్తాం.

16. ఆలయాల అభివృద్ధి..
బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో దేవాలయాలను పునరుద్ధరిస్తాం. సదాశివపేటలోని సంగమేశ్వరాలయంలోని కల్యాణ మండపం నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తాం.

అభివృద్ధి చేసేవారికే పట్టం కట్టండి

కొండాపూర్(సంగారెడ్డి): అభివృద్ధి చేసేవారికే పట్టం కట్టాలని, మోసపూరిత హామీలచ్చే కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని తేర్పోల్, గోపులారం, హరిదాసుపూర్, తమ్మలిబాయితండా, జాలిగుట్ట తండా, ఎదురుగూడెం, గంగారం గ్రామాల్లో చింతా ప్రభాకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, పార్టీ అధ్యక్షుడు విఠల్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పాండురంగం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.